

సెల్ఫ్ డిఫెన్స్ ప్రోగ్రాం గడువు పొడిగింపు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సెల్ఫ్ డిఫెన్స్ ప్రోగ్రాం దరఖాస్తు గడువు ఈ నెల 22 వరకు పొడగించినట్లు డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 2024-25 సంవత్సరానికి సెల్ఫ్ డిఫెన్స్ ప్రోగ్రాం కింద ఎంపికైన 169 పాఠశాలల్లో నెలలో 12 సెషన్స్ చొప్పున నవంబరు నుంచి జనవరి 2025 వరకు 36 సెషన్స్ నిర్వహించాల్సి ఉంటుందన్నారు. కరాటే, తైక్వాం డో, వుషు, బాక్సింగ్, కిక్ బాక్సింగ్ ట్రైనర్స్ దరఖాస్తు చేసుకోవాలని, నెలకు ఐదు వేల రూపాయల గౌరవ వేతనం ఇస్తారని తెలిపారు. స్థానిక, మహిళా అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యం ఉంటుందని, అర్హత గలవారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లను ఉపయోగించాలి

- కలెక్టర్ పమేలా సత్పతి



మానకొండూర్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

మానకొండూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు మరుగుదొడ్లను ఉపయోగించాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మానకొండూర్‌లోని బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మరుగుదొడ్లను ఉపయోగించిన అనంతరం నీరు పోసి చేతులు, కాళ్ళను శుభ్రంగా కడుక్కోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు మరుగుదొడ్లను నిర్మించుకోవాలన్నారు. పాఠశాలలో మరుగుదొడ్లు శుభ్రంగా లేకపోతే ప్రధానోపాధ్యాయుడి దృష్టికి తీసుక రావాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం మరుగుదొడ్ల వాడకంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్, ఎంపీడీవో వరలక్ష్మి, ఎంఈవో మధుసుదనా చారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు డ్రైవింగ్ శిక్షణ

భగత్‌నగర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, కార్పొరేషన్ ద్వారా నిరుద్యోగ యువతకు ఆర్టీసీ ఆధ్వర్యంలో హెవీ డ్రైవింగ్‌లో వృత్తి నైపుణ్య అభివృద్ధి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. లైట్ వెహికిల్ డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న ఎస్సీ నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని డిప్యూటీ రీజినల్ మేనేజర్ భూపతిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 35 రోజుల పాటు నిర్వ హించే శిక్షణ కార్యక్రమంలో థియరీ, బస్సు డ్రైవింగ్‌పై ప్రాక్టికల్స్ ఉంటాయ న్నారు. శిక్షణ పొందిన యువకులు ఆర్టీఏ కార్యాలయం నుంచి హెవీ మోటార్ డ్రైవింగ్ లైసెన్స్ పొందవచ్చన్నారు. కార్యక్రమంలో కరీంనగర్-2 డిపో మేనేజర్ మల్లయ్య, డిపో సేఫ్టీ డ్రైవింగ్ ఇన్స్‌పెక్టర్ బాలయ్య పాల్గొన్నారు. శిక్షణ తీసుకుంటున్న యువకులు ఎస్సీ కార్పొరేషన్ అధికారి శ్రీనివాస్, ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ఎస్ సుచరితను కలిశారు.



ఆందోళన బాటలో..

- నేటి నుంచి ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలు నిరవధిక బంద్
- రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించని ప్రభుత్వం
- ఉద్యోగుల జీతాలు చెల్లించలేని స్థితిలో యజమాన్యాలు
- ఆందోళనలో విద్యార్థులు, తల్లిదండ్రులు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలు బంద్ బాటపట్టాయి. ఈనెల 20 నుంచి నిరవధిక బంద్ పాటించాలని నిర్ణయించుకున్నాయి. బకాయిల చెల్లింపు కోసం ప్రభుత్వాన్ని పలుమార్లు కోరినా ఉన్నతాధికారుల హామీలు అమలుకు నోచుకోకపోవడంతో కళాశాలలు మూసివేయడం మినహా మరో మార్గం లేదని ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు నిర్ణయించుకున్నాయి. మంగళవారం శాతవాహన యూనివర్సిటీ రిజిస్ట్రార్ ను కలిసి యాజమాన్యాల సంఘం బంద్ నోటీసును ఇచ్చాయి. ఉమ్మడి జిల్లా పరిధిలో 35 ప్రైవేట్ పీజీ కళాశాలలు, 66 డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. వీటిలో సుమారు 45 నుంచి 50వేల మంది విద్యార్థులు డిగ్రీని, ఐదు వేల మంది విద్యార్థులు పీజీ కోర్సుల్లో విద్యనభ్యసిస్తున్నారు. ప్రభు త్వం ఈ విద్యార్థులకు ఇచ్చే ఫీజు రీఎంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయి. 2021-22 విద్యాసంవత్సరం నుంచి ఇప్పటి వరకు సుమారు 250 కోట్ల రూపాయలు ప్రభుత్వం ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలకు చెల్లించాల్సి ఉన్నది. కళాశాలల యాజమా న్యాలు టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందికి వేతనాలు చెల్లించలేని పరిస్థితికి చేరుకున్నాయి. కళాశాలల భవనాల అద్దెను కూడా చెల్లించలేక పోతున్నాయి.

ఇబ్బందుల్లో సిబ్బంది

కళాశాలల్లో సుమారు 5,500 మంది టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది పనిచేస్తున్నారు. నాలుగైదు నెలలుగా వేతనాలు అందక పోవడంతో వేతన జీవులు కూడా ఇల్లు అద్దె చెల్లించలేక, ఇతర అవసరాలు తీర్చుకునే మార్గం లేక తమ పిల్లల స్కూల్ ఫీజులు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేతనాల కోసం యాజమాన్యాలపై ఒత్తిడి తెస్తే ఉద్యోగం ఉంటుందో, ఊడుతుందో తెలియని పరిస్థితిలో వారు ఆవేదనకు గురవుతున్నారు. బకాయిల చెల్లింపునకు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ గత అక్టోబరులోనే ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు నిరవధిక బంద్‌కు పిలుపునిచ్చాయి. అప్పుడు ప్రభుత్వం పక్షాన విద్యాశాఖ కార్యదర్శి బుర్ర వెంకటేశం ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలతో చర్చించి వారంరోజుల్లోగా బకాయిలు విడుదల చేయిస్తామని హామీ ఇచ్చారు. నెలరోజులు గడిచినా బకాయిలు విడుదల చేయకపోవడంతో మళ్లీ ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు 20 నుంచి కళాశాలలను నిరవధికంగా మూసివేయాలని నిర్ణయం తీసుకున్నాయి. ఈ మేరకు సంఘం నాయకులు శాతవాహన యూనివర్సిటీ వైస్ చాన్సలర్‌కు లేఖను అందించారు.



వీసీ ఉమేష్‌కుమార్‌కు నోటీసు ఇస్తున్న సుప్మా ప్రతినిధులు

పరీక్షలూ నిర్వహించలేని పరిస్థితి

కళాశాలలు నిర్వహిస్తున్న భవనాల అద్దెను చెల్లించలేక పోవడంతో

మిగతా 8వ పేజీలో...

బకాయిలు చెల్లిస్తేనే కళాశాలలను తెరుస్తాం

- వెంకటేశ్వర్‌రావు, ఎస్‌యూ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాల సంఘం అధ్యక్షుడు



ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లిస్తేనే కళాశాలలను తెరుస్తాం. బకాయిల కారణంగా కళాశాలలను నడపలేని తప్పనిసరి పరిస్థితి వచ్చింది. విధిలేకనే నిరవధిక బంద్ నిర్ణయం తీసుకున్నాము. విద్యార్థులను ఇబ్బంది పెట్టాలనే ఆలోచన లేదు. కళాశాలల నిర్వహణ కోసం తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక పోతున్నాం. విద్యార్థులను ఫీజులు అడిగే పరిస్థితి లేదు. సిబ్బందికి వేతనాలు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడింది. కళాశాలలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. అద్దె చెల్లించకపోవడంతో భవనాలకు యజమానులు తాళం వేస్తామని బెదిరిస్తున్నారు. పరిస్థితి చేయి దాటడంతోనే బంద్ పాటిస్తున్నాం. వెంటనే ఫీజు రీ యింబర్స్‌మెంట్‌బకాయిలు విడుదల చేయాలి.

బకాయిల విడుదలలో నిర్లక్ష్యం సరికాదు ...

- మణికంఠరెడ్డి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు



రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను ప్రభుత్వం విడుదల చేయక పోవడంతో కళాశాలల యాజమాన్యాలు బంద్ పాటించి పరీక్షలు బహిష్కరిస్తామనే స్థితి వచ్చింది. ప్రభుత్వం నిర్లక్ష్యంతోనే ఈ పరిస్థితులు వచ్చాయి. విద్యార్థుల చదువులతో, జీవితాలతో చెలగాటమాడడమే. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి రాగానే ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేస్తామని చెప్పారు. ఇచ్చిన మాటను నెరవేర్చుకోవడానికి వెంటనే ఫీజు, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలి.

అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి



ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి

భగత్‌నగర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి విమర్శించారు. మంగళవారం నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలనలో ప్రజలకు చేసిందేమి లేదన్నారు. ప్రభుత్వ తీరును ఎండగట్టడానికి ఉద్యమిస్తామని, ప్రజలకు అండగా ఉంటామన్నారు. ఆరు గ్యారంటీలు, హామీలు, డిక్లరేషన్లు ఏమయ్యాయని ప్రశ్నించారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని, ఏ ఒక్క గ్యారంటీని పూర్తి స్థాయిలో అమలు చేయలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ తప్పులను ఎత్తిచూపి కేసుల పేరిట రాద్ధాంతం చేసిన కాంగ్రెస్ సర్కార్ ఆ అంశాలను పక్కదారి పట్టించిందన్నారు. డ్రగ్స్, హైడ్రా లాంటి అంశాలను తెరపైకి తెచ్చిందన్నారు. కులగణన పేరిట రాజకీయాలు చేస్తోందని విమర్శించారు.. ప్రజాపాలన పేరిట దరఖాస్తులు స్వీకరించారు కాని ప్రజలకుచేసిందేమి లేదన్నారు. ప్రజా క్షేత్రంలో కాంగ్రెస్ తీరును ఎండగట్టి ప్రజలందరికీ న్యాయం జరిగే వరకు బీజేపీ తరుపున పోరాడతామన్నారు. సమావేంలో మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, బాస సత్యనారాయణరావు, డి శంకర్, కోమల అంజనేయులు, గుగ్గిళ్ల రమేష్, ఇనుగొండ నాగేశ్వర్‌రెడ్డి, బూట్ల రాజేంద్రప్రసాద్, కొరటాల శివరామయ్య, బోయినపల్లి ప్రవీణ్‌రావు, మాడ వెంకట్‌రెడ్డి, బత్తుల లక్ష్మీనారాయణ, రంగు భాస్కరాచారి, గుర్రాల వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ఇళ్లు నిర్మించి ఆరేళ్లు...

ఇవ్వడానికి ఇంకెన్నేళ్లు...?

- అందని ద్రాక్షగా డబుల్ బెడ్‌రూం ఇళ్లు...
- ఆశగా ఎదురుచూస్తున్న నిరుపేదలు

హుజూరాబాద్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్‌లో డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఆరేళ్లు దాటినా నిరుపేదలకు అందలేదు. ఇళ్ల కోసం కళ్లకు ఒత్తులు పెట్టుకొని నిరుపేదలు ఆశగా ఎదురుచూస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి రాగానే అప్పటి మంత్రి ఈటల రాజేందర్ పట్టణ శివారులోని గణేష్‌నగర్‌లో 500ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఏడాదిన్నరలోనే 500 ఇళ్లు పూర్తయ్యాయి. హుజూరాబాద్ ఉప ఎన్నిక సమయంలో నిరుపేదలు డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకోవాలని అప్పటి ఎన్నికల ఇన్‌చార్జి మాజీ మంత్రి హరీష్‌రావు సూచించారు. దీంతో నాలుగు వేల మంది నిరుపేదలు దరఖాస్తులు చేసుకున్నారు. అయినా డబుల్ బెడ్‌రూం ఇళ్ల అందజేయలేదు. ఏడాది క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల ముందు ఎమ్మెల్సీగా ఉన్న కౌశిక్‌రెడ్డి డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తారని పేద ప్రజలు ఎదురుచూశారు. ఎన్నికల తర్వాత డబుల్ బెడ్‌రూం ఇళ్లు అందజేస్తామని కౌశిక్‌రెడ్డి చెప్పారు. ఈలోగా ప్రభుత్వం మారింది. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ వద్దకు నిరుపేదలు వెళ్లి తమకు ఇళ్లు కావాలని దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటి వరకు డబుల్ బెడ్‌రూం ఇళ్ల ఊసెత్తడం లేదు. ఇప్పటి వరకు ఆరు వేల మంది దరఖాస్తు చేసుకున్నట్లు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగానైనా డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని నిరుపేదలు కోరుతున్నారు.



హుజూరాబాద్‌లో పూర్తయిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు

మాయమవుతున్న కిటికీలు.. తలుపులు...

పట్టణ శివారులోని గణేష్‌నగర్‌లో డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఆరేళ్లు పూర్తయిన నిరుపేదలకు కేటాయించలేదు. దీంతో డబుల్ బెడ్‌రూంలోని కిటికిలు, తలుపులు, విద్యుత్ వైర్లను ఎత్తుకెళ్లడంతో పాటు డ్రైనేజీ పైపులను ధ్వంసం చేస్తున్నారు. అసాంఘిక కార్యక్రమాలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు అడ్డాగా మారాయి. గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి మద్యం సేవిస్తున్నారు.

ఉద్యోగులపై దాడిని ఖండిస్తున్నాం
- టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి
- సుభాష్‌నగర్, ఆంధ్రజ్యోతి
6

పెండింగ్ డీఏలు విడుదల చేయాలి
- కలెక్టరేట్ ఎదుట పెన్షనర్ల ధర్నా
- సుభాష్‌నగర్, ఆంధ్రజ్యోతి
6

గంజాయి పట్టివేత
- ఐదుగురు నిందితుల అరెస్ట్
- కరీంనగర్ క్రైం, ఆంధ్రజ్యోతి
6

దివ్యాంగుల ప్రతిభ, స్ఫూర్తి

పలువురికి ఆదర్శం



కార్యక్రమంలో మాట్లాడుతున్న మేయర్ సునీల్ రావు, పక్కన కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు చాటుతున్న ప్రతిభ, స్ఫూర్తి పలువురికి ఆదర్శనీయమని మేయర్ వై సునీల్‌రావు అన్నారు. వచ్చే నెల 3న దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో మహిళలు, పిల్లలు, వికలాంగులు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులకు క్రీడా పోటీలు నిర్వహించారు. మేయర్ వై సునీల్‌రావు, కలెక్టర్ పమేలా సత్పతి హాజరై జెండా ఊపి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ దివ్యాంగులపై ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ చూపాలని అన్నారు. కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ కరీంనగర్ నుంచి పోటీల్లో పాల్గొన్న దివ్యాంగులు రాష్ట్రస్థాయిలోనూ రాణించాలని ఆకాంక్షించారు. దివ్యాంగులు చదువుకునే పాఠశాలల్లో ఎటువంటి సౌకర్యాలు కావాలన్నా ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, జిల్లా సంక్షేమ అధికారి ఎం సరస్వతి, జిల్లా విద్యాధికారి జనార్ధన్‌రావు, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ అనిల్ ప్రకాశ్, మాజీ మేయర్ రవీందర్‌సింగ్, డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్, రెడ్‌క్రాస్ సొసైటీ బాధ్యులు పెండ్యాల కేశవరెడ్డి, క్లబ్ బాధ్యులు చిదుర సురేష్, పొరెల్ల శ్రీనివాస్, శరత్ కృష్ణ, సీడీపీవోలు సబిత, కస్తూరి, శ్రీమతి పాల్గొన్నారు.

ఏసీబీ వలలో అంతర్గాం తహసీల్దార్

డబ్బులు పడేసి పారిపోయిన ఆర్ఐ





తహసీల్దార్ ఉయ్యాల రమేష్, బాధితుడు ఆలకుంట మహేష్

అంతర్గాం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : అంతర్గాం తహసీల్దార్ ఉయ్యాల రమేష్‌తో పాటు ఆర్ఐ ఎగ్గిడి శ్రీధర్‌లు ట్రాక్టర్ ఓనర్ వద్ద రూ.12వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఏసీబీ అధికారులు, బాధితుడు ట్రాక్టర్ ఓనర్ ఆలకుంట మహేష్ తెలిపిన వివరాల ప్రకారం... గత నెల 28న మండల పరిధిలోని లింగాపూర్ గోదావరినది సమీపంలో ట్రాక్టర్‌ను అంతర్గాం పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్ ఓనర్ ఆలకుంట మహేష్‌ను పోలీసులు తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. జరిమానా రూ.50 వేలు చెల్లించాలంటూ తహసీల్దార్ రమేష్ చెప్పారు. తాను పేదవాడినని అన్ని డబ్బులు చెల్లించలేనని బాధితుడు మహేష్ వేడుకోగా సంబంధిత ఆర్ఐ శ్రీధర్‌ను కలవమని తహసీల్దార్ సూచించారు. దీంతో బాధితుడు ఆర్ఐని కలువగా రూ.12 వేలు డీడీ తీసి ఇవ్వడంతో పాటు మరో రూ.12వేలు అదనంగా ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచన మేరకు బాధితుడు రూ.12వేల డీడీతోపాటు రూ.12వేల నగదును ఆర్ఐ శ్రీధర్‌కు ఇవ్వగా, ఆయన డబ్బులతో తహసీల్దార్ చాంబర్‌కు వెళ్లాడు. వెంటనే ఆఫీస్‌లోకి వచ్చిన ఏసీబీ అధికారులు తహసీల్దార్ రమేష్, ఆర్ఐ శ్రీధర్‌లను పట్టుకునేందుకు ప్రయత్నించగా డబ్బులు ఆఫీస్ బయట పడవేసిన ఆర్ఐ శ్రీధర్ తప్పించుకొని పరారయ్యాడు. దీంతో ఏసీబీ అధికారులు తహసీల్దార్ రమేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. అంతకు ముందు బాధితుడితో మాట్లాడిన తహసీల్దార్ రమేష్, ఆర్ఐ శ్రీధర్‌పై కేసు నమోదు చేసినట్లు ఏసీబీ అధికారులు పేర్కొన్నారు. దాడులలో ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి, ఇన్‌స్పెక్టర్లు కృష్ణ కుమార్, తిరుపతి, సిబ్బంది పాల్గొన్నారు.



బద్దిపోచమ్మ ఆలయం వద్ద భక్తుల కోలాహలం

బద్దిపోచమ్మకు బోనాల మొక్కులు

డప్పుచప్పుళ్లు, శివసత్తుల నృత్యాలతో ఊరేగింపు

వేములవాడ కల్చరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి అనుబంధ ఆలయమైన బద్దిపోచమ్మ అమ్మవారికి భక్తులు బోనాల మొక్కులు చెల్లిం చుకున్నారు. సోమవారం రాజన్నను దర్శించుకున్న భక్తులు మంగళవారం తెల్లవారు జామున అమ్మవారికి నైవేద్యాన్ని ఏర్పాటు చేసుకుని డప్పు చప్పుళ్ల మధ్య శివసత్తుల నృత్యాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. నెత్తిన బోనాలతో గంటల తరబడి అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరారు. బద్దిపోచమ్మకు పట్నాలు వేసి ఒడిబియ్యం సమర్పించారు. అనంతరం అమ్మవారికి కల్లు సాక పెట్టి పిల్లాపాపలు, పాడిపంటలు చల్లంగా ఉండాలని వేడుకున్నారు.



బోనాలతో బారులు తీరిన భక్తులు

ఉద్యోగులపై దాడిని ఖండిస్తున్నాం

ఉద్యోగ జేఏసీ చైర్మన్, టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి

సుభాష్‌నగర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కొంతమంది నాయకులు తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం ఉద్యోగులపై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఉద్యోగ జేఏసీ చైర్మన్, టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక టీఎన్‌జీవో భవన్‌లో ఆయన మాట్లాడుతూ అమాయక ప్రజలను రెచ్చగొడుతూ తమ రాజకీయ పబ్బం గడుపుకుంటున్నారని దుయ్యబట్టారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకుపోయి అమలు చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులను బెదిరింపులకు గురి చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆ ప్రభుత్వం ఆదేశాలను ఉద్యోగులు పాటిస్తారన్నారు. తమ స్వంత ఆలోచనలు గాని, స్వంత ఎజెండా గాని ప్రభుత్వ ఉద్యోగులకు ఉండదని ఈ విషయాన్ని రాజకీయ పార్టీలు, రాజకీయ నాయకులు గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సంగెం లక్ష్మన్‌రావు, నాగులు నరసింహస్వామి, హరికృష్ణ, రాగి శ్రీనివాస్, గూడ ప్రభాకర్‌రెడ్డి, ముప్పిడి కిరణ్ కుమార్‌రెడ్డి, ఒంటెల రవీందర్‌రెడ్డి, గంగారపు రమేశ్, మహిళ ఉద్యోగుల ప్రతినిధులు శారద, సునీత, విజయలక్ష్మి, శైలజ, సర్దార్ హర్మిందర్‌సింగ్, జలాలుద్దీన్‌అక్బర్, గుంటి బిక్షపతి, అభిషేక్‌రెడ్డి, శంకర్, మన్మిత్‌సింగ్, హస్గర్ శ్రీనివాస్, కమలాకర్, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షకార్యదర్శులు కోట రామస్వామి, శంకరయ్య, రాజేశ్వర్‌రావు, ఎల్లె శీను, వంశీ, బోనాల రవి, అజయ్, నారాయణ, వివిధ ఉద్యోగ సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా స్థాయి బీచ్ వాలీబాల్ పోటీలు

శంకరపట్నం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కేశవపట్నం జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల క్రీడా మైదానంలో ఉమ్మడి జిల్లా అండర్-14, అండర్-17 బాలబాలికల బీచ్‌వాలీబాల్ ఎంపిక పోటీలను ఎంఈవో లక్ష్మినారాయణ మంగళవారం ప్రారంభించారు. ఈపోటీల్లో వివిధ పాఠశాల నుంచి వచ్చిన వందమంది క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుభాష్, పెట రాష్ట్ర ఉపాధ్యక్షుడు కృష్ణ, హ్యాండ్ బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శ్రీను, మోడల్ స్కూల్ ప్రెసిడెంట్ అనూప్‌రెడ్డి పాల్గొన్నారు.

వృద్ధురాలి మృతదేహం వెలికితీత

హుజూరాబాద్‌రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని దమ్మక్కపేటకు చెందిన కొండబత్తిని రాజేశ్వరి(65) సోమవారం బావిలో దూకగా, రెండు రోజుల పాటు గాలించిన పోలీసులు గ్రామస్థుల సహాయంతో మంగళవారం మృతదేహన్ని బయటికి తీశారు. రాజేశ్వరి భర్త రాజాకిషన్ 14సంవత్సరాల నుంచి పక్షవాతంతో బాధపడుతున్నారు. భర్త పరిస్థితిని చూసి మనోవేదనకు గురైన రాజేశ్వరి బావిలో దూకి ఆత్మహత్యకు చేసుకుంది. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రాజేశ్వరి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తిరుమల్‌గౌడ్ తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

బీర్‌పూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొల్వాయి గ్రామంలో సోమవారం గ్రామానికి చెందిన సల్ల గంగన్న ఇల్లు షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమయింది. బాధి తులు గంగన్న కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ప్రమాదంలో 65వేల నగ దు, ముప్పావు తులంబంగారం, 25 తులాల వెండి పూర్తిగా కాలిపోయిందని విలపించారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ పరిశీలకులు శ్రీనివాస్ సంఘటన స్థలానికి చేరుకొని ప్ర మాద నష్టాన్ని అంచనా వేసి పై అధికారులకు నివేదించారు.

ఒకరిపై కేసు నమోదు

చొప్పదండి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఈనెల 15న గాలిపెల్లి కనకయ్యకు చెందిన వస్త్ర దుకాణాన్ని పెట్రోల్‌పోసి నిప్పంటించిన కోడూరి శ్రీనివాస్ అనే వ్యక్తిపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ అనూష మంగళవారం తెలిపారు. వస్త్ర దుకాణంలో మంటలు వ్యాపించగా ఆరులక్షల రూపాయల ఆస్తినష్టం వాటిల్లినట్లు వ్యాపారి కనకయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

విత్తన చట్టంలో మార్పులు, చేర్పులు చేస్తాం

రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి

జగిత్యాల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయిలో రైతులను విత్తన కంపెనీల నుంచి మోసాలకు గురికాకుండా విత్తన చట్టంలో మార్పులు, చేర్పులు చేసే విధం గా ప్రభుత్వం దృష్టికి తీసుకవెళ్తామని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ అధ్య క్షుడు అన్వేష్ రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని సమీ కృత కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న విత్తన చట్టంలో ఉన్న లొసుగుల వల్ల ప్రైవేటు కంపెనీలకు అనుకూలంగా ఉన్న పరిస్థితులున్నాయన్నారు. ప్రైవేటు కంపెనీల మోసాలకు గురికాకుండా ప్రభుత్వ విత్తన సంస్థ అందించే మేలు అయిన రకాల విత్తనాలను వినియోగించాలని రైతులను కోరారు. వివిధ రకాల ప్రైవేటు కంపెనీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయన్నారు. రకరకాల ఆకర్షనీయమైన ప్రకటనలతో ఆకర్శించి సొంత వెరైటీ విత్తనాలను రైతులకు విక్రయించి ఇబ్బందులకు గురిచేస్తున్నాయన్నారు. ప్రైవేటు విత్తనాల వల్ల రైతులు పంట నష్టపోతే పరిహారం అందించడం లేదన్నారు. కేవలం విత్తన పెట్టుబడులను మాత్రమే అందిస్తున్నారన్నారు. పంట ఉత్పత్తుల ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేసే యోచన చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై కొందరు రకరకాల ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘ నాయకులు పిడుగు తిరుపతిరెడ్డి, సంజీవ్‌రెడ్డి పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు అందించడమే లక్ష్యం

రాష్ట్రంలో రైతాంగానికి నాణ్యమైన విత్తనాలు అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి అన్నారు. మంగళ వారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా వ్యవసాయ శాఖ, ప్రాథమిక వ్యవసాయ సంఘాల కార్య దర్శులు, వ్యవసాయ అధికారులతో యా సంగి 2024-25 పంట సీజన్ సందర్భంగా ప్రత్యే క సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. రానున్న రోజుల్లో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ కార్యక్రమా లను మరింత ముమ్మరం చేస్తామన్నారు. నా ణ్యమైన విత్తనాలు అందించే విత్తనాభివృద్ధి సం స్థను సహకార సంఘాలు ప్రోత్సహించాలన్నా రు. జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత, డీసీఎం ఎస్ చైర్మన్ ఎలాల శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా సహకార అధికారి సీహెచ్ మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలు విడుదల చేయాలి



కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న తెలంగాణ ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్‌పర్సన్ అసోసియేషన్ బాధ్యులు, పాల్గొన్న పెన్షనర్లు

సుభాష్‌నగర్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి) : పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చందుపట్ల జనార్దన్ డిమాండ్ చేశారు. మంగళవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన పీఆర్‌సీని 2023 జూలై నుంచి అమలు చేయాలని డిమాండ్ చేశారు. అర్హత కలిగిన ఈపీఎస్ పెన్షనర్లకు కనీస పెన్షన్ రూ.15వేలు ఇవ్వాలని, ప్రతి జిల్లా కేంద్రంలో రెండు వెల్‌నెస్ సెంటర్లను ఏర్పాటు చేసి, పెన్షనర్లు, ఉద్యోగులు, ఉపాధ్యాయులకు కార్పోరేట్ స్థాయిలో వైద్యం అందించాలని కోరారు. గ్యాడ్యుటీని కేంద్ర ప్రభుత్వం మాదిరిగా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు రూ. 20లక్షలు చెల్లించాలని కోరారు. పెన్షనర్లు కూడా తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారని, వారికి ప్రత్యేక ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షుడు కట్ట నాగ భూషణాచారి, కోశాధికారి ఇరువంటి తిరుమలయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు బొంగోని వెంకటయ్య, గరిగ చంద్రయ్య, నల్ల ప్రభాకర్‌రెడ్డి, రాయికంటి రామకృష్ణయ్య, ఆర్‌టీసీమల్లయ్య చొల్లెటి మాల్లరెడ్డి, అరికాల చంద్రమౌళి, తాటిపాముల కనకయ్య, ఎస్ సారభద్రస్వామి, బి జగదీశ్వర్, కొండా రాజయ్య, ఎం గోపాల్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, ఊకంటి లక్ష్మీనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న పలువురి అరెస్టు

వివరాలు వెల్లడించిన మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి

మెట్‌పల్లి టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గంజాయి అమ్మితే కఠినచర్యలు తీసుకుంటామని మెట్‌పల్లిసీఐ నిరంజన్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం ఇబ్రహీంపట్నం మండలం బండలింగాపూర్ క్రాస్ రోడ్డు వద్ద గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ బండలింగాపూర్ రోడ్డు వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా నెంబర్ ప్లేట్ లేని బైక్‌పై ముగ్గురు వ్యక్తులు వెళ్తుండగా ఆపి తనిఖీ చేయగా బైక్‌లో నల్లని కవరులో తీసు కెళ్తున్న గంజాయిని పట్టుకున్నాట్లు తెలిపారు.

వారి వద్ద నుండి 220 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నాట్లు తెలిపారు. గంజాయి తర లిస్తున్న మెట్‌పల్లికి చెందిన లోకిని వంశీ, కోయిల్కర్ రమేష్, లోకిని విగ్నేష్‌లను విచారించగా నిజామాబాద్ రైలులో నాందెడుకు వెళ్లి గతంలో పరిచయం ఉన్న అజార్ అనే వ్యక్తి వద్ద నుండి గంజాయి కోనుగోలు చేసి అక్కడి నుండి మెట్‌పల్లికి కోను గోలు చేసిన గంజాయిని చిన్న చిన్న ప్యాకెట్లుగా చేసి 500 చొప్పున అమ్మిందుకు వస్తుండగా పట్టుకున్నాట్లు తెలిపారు. ముగ్గురు నిందితు లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి బైకు 3 సెల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకోని సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఎస్ఐ అనిల్, పోలీస్ సిబ్బంది సాదు నాయక్, సంతోష్‌లు ఉన్నారు.

● ఐదుగురు నిందితుల అరెస్టు

కరీంనగర్ క్రైం, (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం మొగ్ధుంపూర్ వద్ద మంగళవారం కరీంనగర్ రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ లక్ష్మారెడ్డి సిబ్బందితో వాహనాల తనిఖీ నిర్వహించగా ఐదుగురు నిందితుల వద్ద కిలో 98 గ్రాముల గంజాయి పట్టుబడింది.



ఎస్ఐ లక్ష్మారెడ్డి సిబ్బందితో వాహనాల

కరీంనగర్ రూరల్ పోలీసుల వివరాల ప్రకారం మొగ్ధుంపూర్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా రెండు బైక్‌లపై వస్తున్న ఐదుగురు వ్యక్తులు పోలీసులను చూసి బైక్‌లను అక్కడే వదిలిపెట్టి పారిపోయే ప్రయత్నం చేయగా వెంటనే అప్రమత్తమైన పోలీసులు ఐదుగురిని అదుపులోకి తీసుకుని సోదా చేయగా నిషేధిత గంజాయి పట్టుబడింది. అనంతరం వారిని విచారించగా మహారాష్ట్రలోని బల్లార్షలో కొనుగోలు చేసి తీసుకువస్తున్నట్లు వెల్లడైంది. పట్టుబడిన నిందితులు కుందనపల్లికి చెందిన మేకల మహేందర్(22), తొర్తి శశికుమార్(24), ఫకీర్‌పేట్ గ్రామానికి చెందిన కడప వంశీ(19), ఎండీ సాధాకత్ అలీ(20), నగునూర్‌కు చెందిన గద్దల శ్రీరాం(19)లను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచి జడ్జి ఆదేశాల మేరకు జైలులో రిమాండ్‌కు తరలించామని పోలీసులు తెలిపారు.

నిధులు మంజూరై రెండేళ్లు

● పనులు ప్రారంభానికి ఎన్నేళ్లో ● లోలెవల్ కల్వర్టుతో ప్రయాణికులకు ఇక్కట్లు



లో లెవల్ కల్వర్టు

పెగడపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించని చందంగా ఉంది పెగడపల్లి మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోని లోలెవల్ కల్వర్టు పరిస్థితి. నిధులు మంజూరై రెండేళ్లు కావస్తున్నా నిర్మాణ పనులు ప్రారంభానికి మాత్రం మోక్షం లభించడం లేదు. పెగడపల్లి మండల కేంద్రం నుంచి గోపాల్‌రావుపేట వెళ్లే రోడ్డులో సబ్‌స్టేషన్ సమీపంలో లో లెవల్ బ్రిడ్జితో వర్షాకాలంలో బ్రిడ్జిపై నుంచి భారీగా వరద నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది దీంతో పాటు కల్వర్టు సైతం శిథిలా వస్థకు చేరుకోగా గత ప్రభుత్వం హయాంలోనే హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి గాను రూ. రెండు న్నర కోట్లు మంజూరయ్యాయి. ఈ మేరకు టెండర్ ప్రక్రియ సైతం పూర్తయింది. నిధులు మంజూరు, టెండరు పూర్తయినా నిర్మాణ పనులు చేపట్టకపోవడంతో ఆ రోడ్డు ద్వారా ప్రయాణించే ప్రయాణికులు కల్వర్టు దాటే వరకు భయం భయంగా ప్రయాణించాల్సి వస్తోంది. ఇప్పటికైనా స్థానిక శాసన సభ్యులు, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జోక్యం చేసుకుని నిర్మాణ పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

ఆవుపై అడవి జంతువు దాడి

సైదాపూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్లపల్లి గ్రామానికి చెందిన రైతు బాసవేని కుమార్‌కు చెందిన ఆవుపై సోమవారం రాత్రి గుర్తు తెలియని అడవి జంతువు దాడి చేసి గాయపరిచింది. రైతు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం సాయంత్రం తన వ్యవసాయ బావి వద్ద ఆవును కట్టేసి ఇంటికి వచ్చాడు. ఉదయం వెళ్లి చూసేసరికి ఆవు మెడ కింది ముందు కాలు వద్ద పెద్ద గాయమయ్యి ఉందని తెలిపాడు. వెంటనే పశువైద్యులకు సమాచారం ఇవ్వగా సిబ్బంది వచ్చి ట్రీట్‌మెంట్ చేశారన్నారు. ఆవుపై దాడి చేసింది హైనా అయి ఉంటుందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఇల్లంతకుంట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాలిపెల్లి గ్రామ సమీపంలోని బిక్కవాగు నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఇసుకను తరలిస్తున్నారనే సమాచారం మేరకు దాడిచేసినట్లు పేర్కొన్నారు. వాహనాన్ని స్వాధీనం చేసుకొని ఇసుకను తరలిస్తున్న బద్దం రమేష్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

అధ్వానంగా ఎస్సారెస్పీ కాలువలు



పట్టర్లు లేకుండా మిగిలిపోయిన తూములు

● పట్టించుకోని అధికారులు

● ఆందోళనలో రైతులు

పెగడపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఎస్సారెస్పీ కాలువల మరమ్మతు లేక కాలువల ఆనవాళ్లు కోల్పోతున్నాయి. పెగడపల్లి మండలంలోని 23 గ్రామాలకు గాను నందగిరి, అయిత్‌పల్లి మినహా 21 గ్రామాలు శ్రీరాంసాగర్ ఆయకట్టు పరిధిలోనే ఉండగా కాలువ నీరు వస్తేనే పంటలు పూర్తి స్థాయిలో పండేది. కాగా మండలంలోని పలు డిస్ట్రిబ్యూటరీ కాలు వలను ఎన్నో ఏండ్ల కింద సిమెంట్ లైనింగ్ చేయగా అప్పటి నుంచి వాటి మరమ్మతు, పూడిక తీత పనులపై పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు.

దీంతో దాదాపు అన్ని డిస్ట్రిబ్యూటరీ కాలువలు పిచ్చిమొక్కలతో నిండిపోవడమే కాకుండా సిమెంట్ లైనింగులు కూలిపోయి, తూముల షట్టర్లు ఊడిపోయి కాలువల ఆనవాళ్లు కనిపించకుండా పోయాయి. ఎస్సారెస్పీ ప్రాజెక్టులో సమృద్ధిగా నీరు ఉంది. రెండవ పంటకు మరి కొద్ది రోజుల్లో నీరు వదిలే పరిస్థితులుండగా కాలువల మరమ్మతు పూడికతీత పిచ్చిమొక్కల తొలగింపునకు మాత్రం ఆ శాఖ అధికారులు దృష్టి సారించిన దాఖలాలు కనిపించడం లేదని రైతులు వాపోతున్నారు. కాలు వలలో పిచ్చి మొక్కలు పెరిగి ప్రధాన కాలువ నుంచి ఎన్ని నీళ్లు వదిలినా ప్రధాన కాలువకు సమీప ప్రాంతాల రైతుల పంట పొలాలకు మాత్రమే నీరు అందుతోంది. చివరి ఆయకట్టు రైతులు ఎప్పుడూ పంటలు ఎండబెట్టుకునే పరిస్థితులే ఉన్నాయంటూ వాపోతున్నారు.

ఇప్పటికైనా సంబంధిత అధికారులు కాలువల మరమ్మతులతో పాటు పిచ్చి మొక్కల తొలగింపునకు చర్యలు చేపట్టి చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందేలా చర్యలు చేపట్టాలని మండల రైతులు కోరుతున్నారు.



పెగడపల్లి శివారులో కాలువలో నిండిన మట్టి

వర్గీకరణను మాలలంతా ఐక్యంగా తిప్పికొట్టాలి

- జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్
- సిరిసిల్లకు చేరుకున్న మాలల మహా పాద్రయాత్ర



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్

సిరిసిల్ల టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణను మానుకోవాలని, వర్గీకరణను మాలలంతా ఐక్యంగా తిప్పి కొట్టాలని జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ అన్నారు. అక్టోబరు 25న భద్రాచలంలో ప్రారంభించిన మాలల మహా పాద యాత్ర మంగళవారం సిరిసిల్ల పట్టణానికి చేరకుంది. మాలమహానాడు జిల్లా, పట్టణ, మండలాల నాయకులు పాదయాత్ర చేస్తున్న పిల్లి సుధాకర్, నాయకులకు ఘన స్వాగతం పలికారు. స్థానిక రగుడు నుంచి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వరకు పాదయాత్ర సాగింది. అంబేద్కర్ విగ్రహానికి సుధాకర్, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ మంత్రి సుద్దాల దేవయ్య మాలల మహా పాదయాత్రకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడారు. మాదిగల కంచంలోని అన్నంను, ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలను గుంజుకుంటున్నామని అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. రాజ్యాంగంతో సంబంధం లేకుండా దొడ్డి దారిలో నరేంద్రమోదీ సుప్రీం కోర్టు ద్వారా రాష్ట్రాలకు వర్గీకరణ చేసుకునే విధంగా వెసులబాటు ఇవ్వడం సిగ్గుచేటన్నారు. మనువాదుల చెరలోకి మందకృష్ణ మాదిగ చేరాడని ఆరోపించారు. దళితులను మనువాదులు హింసలకు, మహిళలపై దాడులకు గురిచేస్తూంటే మనువాదుల మోచేతుల నీళ్లు తాగుతున్న మందకృష్ణమాదిగకు కనబడడం లేదా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం రావాలని మాలలు మొత్తం కాంగ్రెస్ పార్టీ గెలుపుకోసం తిరగారన్నారు. మాలలను మరిచిపోయి ఒక కులానికి కొమ్ము కాయడం సరికాదన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు తుంగ శివరాజు, జిల్లా నాయకులు రెంజర్ల రాజేష్, మేడి అంజయ్య, నాలుక సత్యం, జక్కుల యాదగిరి, రొడ్డ రాంచంద్రం, ఎడ్ల సందీప్, వివిధ మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

చిన్నబోతున్న పర్యాటకం

- ప్రారంభోత్సవానికే పరిమితమైన మిడ్ మానేరు జల విహారం
- కార్మిక, ఆధ్యాత్మిక క్షేత్రానికి.. పర్యాటక సొబగులు దూరమేనా?
- జిల్లాలో మిడ్‌మానేరు, అనంతగిరి ప్రాజెక్టుల వద్ద ప్రతిపాదనలు
- అనంతగిరి ప్రాజెక్టులో 40 ఎకరాల్లో ఐలాండ్
- నేడు సిరిసిల్ల జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

కార్మిక, ఆధ్యాత్మిక జిల్లాగా రాజన్న సిరిసిల్ల నిలుస్తుంది. జిల్లాలో పర్యాటక అభివృద్ధికి ఎన్నో అవకాశాలు ఉన్నా నేతల హామీలు, పరిశీలనలకే పరిమితవుతున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో శ్రీరాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కరకట్ట వద్ద అప్పటి మంత్రులు హడావుడిగా బోటు ప్రారంభించి జల విహారానికి నాంది పలికగా ప్రారంభోత్సవంతోనే నిలిచి పోయింది. దాదాపు మూడు సంవత్సరాలుగా సిరిసిల్ల ప్రజలు జలవిహారానికి ఎదురు చూసినా నిరాశే మిగిలింది. ప్రారంభించిన బోట్లు ఇప్పటికీ కరకట్ట వద్ద వెక్కిరిస్తూ కనిపిస్తున్నాయి. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా పర్యటనకు వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శ్రీరాజరాజేశ్వర మిడ్ మానేరు, అన్నపూర్ణ ప్రాజెక్ట్ వద్ద పర్యాటక రంగంవైపు చూస్తారని ఆశగా ప్రజలు ఎదురుచూస్తున్నారు.


పర్యాటకానికి రెండు ప్రాజెక్టులు కీలకం...

జిల్లాలోని మిడ్‌మానేరు, అన్నపూర్ణ రెండు ప్రాజెక్టులు పర్యాటకానికి కీలకంగా మారుతాయని భావించారు. వేములవాడల శ్రీరాజరాజేశ్వర స్వామి దేవస్థానం ఆధ్యాత్మికతకు పర్యాటకం తోడవుతుందని అనుకున్నారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకాలకు సిరిసిల్ల మానేరు తీరంలోని శ్రీరాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్ట్, అన్నపూర్ణ అనంతగిరి ప్రాజెక్టులు ప్రధానంగా నిలుస్తాయి. ఈ ప్రాజెక్టుల వద్ద పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని 2021 జూలై 4న సిరిసిల్ల జిల్లా పర్యటనకు వచ్చిన అప్పటి ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అనంతగిరి పోచమ్మను దర్శించుకుంటానని అన్నపూర్ణ అనంతగిరి, శ్రీరాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్టులను పర్యాటక అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తానని ప్రకటించారు. వేములవాడ ఆధ్యాత్మికతకు స్వామివారిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులకు పర్యాటకం కూడా స్వాగతం పలుకుతుందని భావించినా ఆచరణలోకి మాత్రం రాలేదు. గత ప్రభుత్వ హయాంలో పలుమార్లు రెండు ప్రాజెక్టుల వద్ద పర్యాటక పరిశీలనలు జరిగాయి. మిడ్ మానేరు వద్ద కొడుముంజ గుట్టలకు కలుపుకొని రోప్‌వేలు కాటేజీల నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించారు. అదే క్రమంలో మిడ్ మానేరు బ్యాక్ వాటర్ సిరిసిల్ల కరకట్ట వద్ద బోటును కూడా సిద్ధం చేసినా కొవిడ్‌తో ప్రారంభానికి నోచుకోలేదు. శాసనసభ ఎన్నికల క్రమంలో గత సంవత్సరం ఆగస్టు 18న హడావుడిగా ప్రారంభోత్సవం చేసి వదిలేశారు. రాజన్న దర్శనానికి వచ్చే భక్తులకు మిడ్ మానేరులోని అందాలను చూసే విధంగా విహరించే అవకాశం అందుబాటులోకి వస్తుందని అనుకున్నా నిరాశే మిగిలింది.

ఐలాండ్ అభివృద్ధికి మోక్షం కలిగేనా...



ఇల్లంతకుంట మండలం అనంతగిరి వద్ద గుట్టలను అనుసంధానం చేస్తూ అన్నపూర్ణ, అనంతగిరి ప్రాజెక్టను నిర్మించారు. ఇక్కడే ఆసియాలోనే అతి పెద్ద సర్జిపూల్ బావిని కూడా నిర్మించారు. ప్రాజెక్టులో మధ్యలో ఉన్న 40 ఎకరాలతో ఉన్న గుట్టను ఐలాండ్‌గా తీర్చిదిద్దాలని నిర్ణయించినా ప్రతిపాదనలకు మోక్షం కలగడం లేదు. ప్రాజెక్ట్ వద్ద పోచమ్మ తల్లి దేవాలయం కూడా ఉంది. పర్యాటకంగా అభివృద్ధి చేస్తే ఇక్కడికి వచ్చే పర్యాటకులు, యాత్రికులకు ప్రాజెక్ట్ ఎంతో ఆహ్లాదాన్ని పంచుతుందని భావిస్తున్నారు. జిల్లాలోని వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానానికి తెలంగాణలోని అన్ని జిల్లాలతో పాటు పొరుగున ఉన్న మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు ప్రతీయేడు లక్షల సంఖ్యలో వచ్చి పోతుంటారు. మిడ్ మానేరు, అనంతగిరి ప్రాజెక్టులను పర్యాటకంగా అభివృద్ధి చేస్తే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని గత ప్రభుత్వం భావించింది. మిడ్ మానేరు ప్రాజెక్ట్ వద్ద బోటింగ్‌తో పాటు అడ్వెంచర్ పార్కు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. జిల్లాకు వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యాటక అభివృద్ధికి బాటలు వేయాలని ఈ ప్రాంతావాసులు కోరుకుంటున్నారు.



అన్నపూర్ణ ప్రాజెక్ట్‌లో బోటు

బకాయిలు విడుదల చేయాలి



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రమేష్

భగత్‌నగర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యా రంగ బకాయిలు విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలో ఏఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలు బంద్ చేస్తే విద్యార్థుల చదువులు ఎలా సాగుతున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చి 11 నెలలు గడుస్తున్నా పెండింగ్ ఫీజు బకాయిలు ఇవ్వకపోవడం సరి కాదన్నారు. రీయింబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి మామిడిపల్లి హేమంత్, నగర నాయకులురవి, రమేష్, రాజు, క్రాంతి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

24న ఉమ్మడి జిల్లా సీనియర్స్ ఖో-ఖో జట్ల ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా సీనియర్స్ పురుషులు, మహిళల ఖో-ఖో జట్ల ఎంపిక పోటీలను ఈ నెల 24న నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో ఉదయం 9:30 గంటల నుంచి ఈ పోటీలను నిర్వహించనున్నామని జిల్లా ఖో- ఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై మహేందర్‌రావు తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటే క్రీడాకారులను వరంగల్ జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి సీనియర్స్ మహిళలు, పురుషుల ఖో-ఖో పోటీలకు ఉమ్మడి జిల్లా జట్లను ఎంపిక చేయనున్నామని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఉదయం 9:30 గంటలకు అంబేద్కర్ స్టేడియంలో ఒరిజినల్ ఆధార్ కార్డు, అలాగే ఒక జిరాక్స్, ఒక ఫొటోతో హాజరు కావాలని పేర్కొన్నారు.

బస్సులు లేక ప్రయాణికుల ఇబ్బందులు



రోడ్డుమీదకు ఎక్కి నిరసన తెలుపుతున్న ప్రయాణికులు

వేములవాడ టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వేములవాడ ఆర్టీసీ బస్టాండులో బస్సులు లేక భక్తులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భక్తులు సోమవారం రాజన్నను దర్శించుకుని మంగళవారం బద్దిపోచమ్మ అమ్మవారికి బోనాలు తీసి వెళ్లడం ఆనవాయితీగా వస్తుంది. ఈ క్రమంలో మంగళవారం రాజన్న భక్తులతో పాటుగా, ప్రయాణికులు ఆర్టీసీ బస్టాండుకు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. దీంతో బస్టాండులో బస్సులు లేకపోవడంతో గంటలపాటు నిరీక్షించిన భక్తులు సహనాన్ని కోల్పోయి రోడ్డుపైకి వెళ్లి వచ్చే బస్సులను అడ్డుకుని నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ప్రయాణికులకు నచ్చజెప్పి ఒప్పించారు. దీంతో ప్రయాణికులు శాంతించారు.

నియంతృత్వ ధోరణి అవలంభిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

- 21న లగచర్లకు వామపక్షనాయకులతో కలిసి వెళ్తాం
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

సిరిసిల్ల నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నియంతృత్వ ధోరణి అవలంభిస్తున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మంగళవారం సీపీఐ జిల్లా మూడవ మహాసభల సందర్భంగా స్థానిక ఆర్డీవో కార్యాలయం నుంచి పట్టణంలోని బీవైనగర్ షాదీఖానా వరకు ఎర్రజెండాలు చేతబూని ప్రధాన వీధుల్లో ప్రదర్శన నిర్వహించారు.



సీపీఎం జెండాను అవిష్కరిస్తున్న రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

అనంతరం జరిగిన బహిరంగ సభలో తమ్మినేని మాట్లాడారు. రాష్ట్రంలో చేపట్టే పనులపై అఖిలపక్షం నాయకులతో చర్చలు జరపకుండా నియంతృత్వ ధోరణికి పాల్పడుతున్నారని అన్నారు. మూసీ నది ఒడ్డున ఉన్న ఇళ్లకు బదులుగా వారికి ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇవ్వడంతోపాటు వారికి ప్రతీనెల 15 వేల రూపాయలను అందించి వారిని ఆదుకోవాలన్నారు.

గత ప్రభుత్వం ఫార్మాసిటీకి హైదరాబాద్ శివారులో 13వేల ఎకరాలను తీసుకున్నారని అక్కడ దానిని నిర్మించకుండా సీఎం నియోజకవర్గంలోని లగచర్లలో 10వేల ఎకరాల భూములను తీసుకోవడం సరైందికాద న్నారు. ఇటీవల అ గ్రామానికి వెళ్లిన జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా అధికారులపై దాడులు చేసిన వారిలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారిని అరెస్ట్ చేసి కాంగ్రెస్ పార్టీ నాయకులను వదిలివేయడం సరైంది కాదన్నారు. పోలీసులు లగచర్ల గ్రామానికి ఎవరి రానీయకుండా చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. ఈ నెల 21వ తేదీన వామపక్షాల పార్టీ నాయకులతో తాను లగచర్ల గ్రామానికి వెళ్లి అక్కడి రైతులు, ప్రజలతో మాట్లాతానని మమ్ములను ఎవరు అడ్డుకుంటురో చూ స్తామన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కమ్యూనిస్ట్ ఉద్యమం బలహీనంగా ఉన్నప్పటికీ బలమైన పోరాటం నిర్మించిందని అన్నారు.



సిరిసిల్లలో సీపీఎం ర్యాలీ

ముఖ్యమంత్రి బుధవారం జిల్లా పర్యటనకు వస్తున్న సందర్భంగా సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి నేతన్నలకు ఉపాధి కల్పించేలా ప్రభుత్వ అర్డర్లను ప్రకటించి తన చిత్తశుద్ధిని ప్రదర్శించాలనిన్నారు. కేంద్రంలోని బీజేపీ హిందుత్వ సిద్ధాంతం కేవలం అదానీ, అంబానీ వం టి అగ్రవర్ణాల ప్రయోజనాల కోసమని అసలైన హిందువులకు మేలు జరగదని వివరించారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు భాస్కర్, రాష్ట్ర కమిటీ సభ్యులు స్కైలాబ్‌బాబు, కూరపాటి రమేష్, జిల్లా కార్యదర్శి మూషం రమేష్, నాయకులు కోడం రమణ, ఎగమంటి ఎల్లారెడ్డి, విమల, గన్నేరం నర్సయ్య, మల్లారపు అరుణ్‌కుమార్, ఎరవెల్లి నాగరాజుపాల్గొన్నారు.

కొండగట్టులో భక్తుల సందడి

మల్యాల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామిని సన్నిధానం మంగళవారం వేలాదిగా తరలివచ్చిన భక్తులతో సందడిగా మారింది. కొండపైకి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. వేకువజాము నుంచే వందలాది వాహనాలు, కాలినడకన కొండపైకి చేరుకున్న భక్తులు అంజన్నకు మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు జరిపారు. మహిళ భక్తులు ఆలయం ముందు గల రావి చెట్టు వద్ద దీపాలు వెలిగించి కార్తీక పూజలు చేశారు. కరీంనగర్ జిల్లా జడ్జి ప్రతిమ అంజన్నను దర్శించుకున్నారు. కొండపైన భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఏఈవో అంజయ్య, పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్రశేఖర్ తదితరులు భక్తుల రద్దీని పర్యవేక్షించారు.



కొండగట్టు ఆలయం వద్ద భక్తులు

ధర్మపురిలో కార్తీక భక్తుల రద్దీ

- ఉసిరిక చెట్టు వద్ద దీపాలు వెలిగించిన మహిళలు

ధర్మపురి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో కార్తీక భక్తుల రద్దీ మంగళవారం పెరిగింది. క్షేత్రానికి భారీగా భక్తులు తరలి వచ్చారు. స్థానిక శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి, అనుబంధ ఆలయాలు భక్తులతో కిట కిటలాడాయి. గోదావరి నదిలో భక్తులు కార్తీక స్నానాలు ఆచరించారు. నదిలో కార్తీక దీపాలు వదిలారు. భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.. నరసింహుడి ఆలయంలో భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కళ్యాణం జరిపించి పూజలు చేశారు. ఆలయం ఆవరణలో గల ఉసిరిక చెట్టు చుట్టు ప్రదక్షిణాలు చేసి, లక్ష వత్తులు వెలిగించి, కార్తీక దామోదరుడిని పూజించారు. మహిళలు దీపాలు, వత్తులు వెలిగించి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. స్వామి వారలకు ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ, వేద పారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ, అర్చకులు, నిత్య పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు.



గోదావరి నది వద్ద హారతి పూజలు


18 వ రోజు ఘనంగా గోదావరి హారతి

కార్తీక మాసం పురస్కరించుకుని ధర్మపురి వద్ద గోదావరి హారతి 18వ రోజు మంగళవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు, అర్చకులు, సిబ్బంది, భక్తులు, మహిళలు గోదావరి నది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ మంత్రోచ్చారణల మధ్య అర్చకులు లోక క్షేమం కోసం, విశ్వశాంతి కోసం విశేష పూజలు జరిపారు. నదీ మాతకు హారతి ఇచ్చి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, వేదపండితులు పాలెపు ప్రవీణ్‌శర్మ, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి పాల్గొన్నారు.

వైభవంగా సామూహిక కార్తీక దీపోత్సవం

- కార్తీక దీపాలు వెలిగించిన భక్తులు
- ఆకట్టుకున్న చిన్నారులు నృత్యాలు

వేములవాడ కల్చరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి క్షేత్రంలో నిర్వహిస్తున్న సామూహిక కార్తీక దీపోత్సవం వైభవంగా కొనసాగుతోంది. రాజన్న ఆలయంలోని కళాభవన్‌లో ఏర్పాటు చేసిన కార్తీక దీపోత్సవం కార్యక్రమానికి మంగళవారం భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. అనంతరం తీరొక్కపూలతో పలు ఆకృతుల్లో అందంగా దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. కాగా నిజామాబాద్‌కు చెందిన సిద్దార్థ కళాక్షేత్రం ఆంధ్ర నాట్యము జయలక్ష్మి బృందం చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ముఖ్య అర్చకులు దుమాల నాగరాజుశర్మ, వెంకటయ్య, కృపాల్ తదితరులు ఉన్నారు.



సామూహిక కార్తీక దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు



కార్తీక సామూహిక దీపోత్సవంలో నృత్యం చేస్తున్న చిన్నారులు

అర్హులు బీమా నమోదు చేయించుకోవాలి

జిల్లా లీడ్‌బ్యాంక్ ఎఫ్ఎల్సీ కోట మధుసూదన్

జగిత్యాలరూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన ప్రతి ఒక్కరు బీమా నమోదు చేసుకోవాలని లీడ్‌బ్యాంక్ ఎఫ్ఎల్సీ కోట మధుసూధన్ అన్నారు. మంగళవారం జగిత్యాల రూరల్ మండలంలోని తక్కళ్లపల్లి గ్రామంలో ప్రధాన మంత్రి జీవనజ్యోతి, బీమాయోజన, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజనపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మధుసూదన్ మాట్లాడుతూ జిల్లా పరిధిలో 18 ఏళ్ల నుంచి 70 ఏళ్ల మధ్య కల్గిన ప్రతి ఒక్కరు బీమా చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పుష్ప, వీవోఏ లత, బీసీ పాయింట్ నిర్వాహకురాలు సిద్దు, సతీష్‌రెడ్డి, మ హిళా సంఘాల సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఘనంగా పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

మల్లాపూర్, నవంబరు, 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వాల్గొండ గ్రామంలోని శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం విశ్వబ్రహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం నుంచి ఆలయంలోని స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం స్వామి వారి కల్యాణం, హోమం వంటి తదితర కార్యక్రమాలు వేదపండితుడు రాజశేఖర్‌చారి వేదమంత్రోత్సవాల మధ్య వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యంలో పాల్గొన్న భక్తులు స్వామి వారి కల్యాణం తిలకించినంతరం దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రహ్మణ సంఘం నాయకులు, సభ్యులు, భక్తులు, పాల్గొన్నారు.



వాల్గొండలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం జరుపుతున్న భక్తులు

పోస్టర్ ఆవిష్కరణ

కరీంనగర్ కల్చరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఈ నెల 27, 28 తేదీల్లో కరీంనగర్ నుంచి వేములవాడ వరకు జరిగే తెలంగాణ ఉద్యమకారుల మహాపాదయాత్ర పోస్టర్‌ను మంగళవారం జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ సత్తు మల్లేశం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం జిల్లా చైర్మన్ కుమారస్వామి, రాష్ట్ర మహిళా నాయకురాలు ప్రసన్న, కరీంనగర్ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు భార్గవి పాల్గొన్నారు.

మినీ లైబ్రరీ ఏర్పాటు చేయాలి

కరీంనగర్ కల్చరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం రేకుర్తి లేదా కొత్తపల్లిలో మినీ లైబ్రరీ ఏర్పాటు చేయాలని మంగళవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశంకు కృషి యూత్ అసోసియేషన్ ప్రతినిధులు బండారి చంద్రయ్య, బోర్లకుంట రేవంత్ వినతి పత్రం సమర్పించారు. చైర్మన్ ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

23న లక్ష దీపకాంతుల మహోత్సవం

కరీంనగర్ రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా కరీంనగర్ మండలం నగునూర్ గ్రామంలోని శ్రీదుర్గా భవానీ ఆలయంలో ఈనెల 23న కార్తీక మాస లక్ష దీపకాంతుల మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు వంగళ లక్ష్మణ్ మంగళవారం తెలిపారు. కార్యక్రమంలో భక్తులు భాగస్వాములై అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

డ్యాం కట్టపై చెట్ల తొలగింపు

కరీంనగర్ అర్బన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారులోని మానేరు జలాశయం కట్టపై రోడ్డుకు ఇరు వైపుల ఉన్న చెట్లను తొలగించేందుకు ఎస్ఆర్ఎస్పీ అధికారులతో మాట్లాడి అమలు చేస్తున్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డికి మానేరు వాకర్స్ గౌరవాధ్యక్షులు, అధ్యక్ష, కార్యదర్శులు, ఆనందం, రేవోజు కనకాచారి, ముస్కుల విద్యాసాగర్‌రెడ్డిలు వాకర్స్ తరపున ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం నరేందర్‌రెడ్డి కట్టపై చెట్ల తొలగింపు పనులను వాకర్స్‌తో కలిసి పరిశీలించారు.

సంకష్టహర చతుర్థి పూజలు

కరీంనగర్ రూరల్, నవంబర్19 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం నగునూర్ గ్రామంలోని పరివార సమేత దుర్గా భవానీ దేవాలయంలోని లక్ష్మి గణపతికి ఆలయ ధర్మాధికారి పురాణం మహేశ్వర శర్మ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా పూజలు నిర్వహించారు.

ఇందిరాగాంధీకి ఘన నివాళి



ఇందిరాగాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

గణేశ్‌నగర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా మంగళవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంతో పాటు నగరంలోని ఇందిరాచౌక్ వద్ద వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మాజీ శాసనసభ్యులు కోడూరు సత్యనారాయణ గౌడ్, ఆరేపల్లి మోహన్, నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్ ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వైద్యుల అంజన్ కుమార్, ఏం డి తాజ్, గడ్డం విలాస్ రెడ్డి, పులి ఆంజనేయులు గౌడ్, కొరివి అరుణ్ కుమార్, అబ్దుల్ రహమాన్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి,ఆకారపు భాస్కర్ రెడ్డి, హర్ష మల్లేశం, నిహాల్, ఇర్ఫాన్,లింగంపల్లి బాబు,అహ్మద్ అలీ, కుర్ర పోచయ్యముల్కల ప్రవీణ్, పడిశెట్టి భూమయ్య, విక్టర్ పాల్గొన్నారు.

●కరీంనగర్ రూరల్: కరీంనగర్ మండలంలో ఇందిరాగాంధీ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాంరెడ్డి రాంరెడ్డి ఆధ్వర్యంలో దుర్శేడ్, గోపాల్‌పూర్ చౌరస్తాలో వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మీసాల సాయిలు, ఉపాధ్యక్షుడు పాలకుర్తి లక్ష్మయ్య, కార్యదర్శులు కామరెడ్డి శ్రీధర్ రెడ్డి, బుర్ర స్వామి గౌడ్, హజీ, పాషా, గ్రామ అధ్యక్షుడు మోతె ప్రశాంత్‌రెడ్డి, బుర్ర హరీష్ గౌడ్ పాల్గొన్నారు.

●హుజూరాబాద్/శంకరపట్నం/జమ్మికుంట/సైదాపూర్/ఇల్లందకుంట/వీణవంక/ చొప్పదండి/గంగాధర/గన్నేరువరం: హుజూరాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శంకరపట్నం మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో మండల అలధ్యక్షుడు గోపగాని బసవయ్య, మాజీ జడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్ గౌడ్ నివాళులర్పించారు. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లి మసీదులోని ముస్లిం విద్యార్థులకు మున్సిపల్ ఇందిరాగాంధీ జయంతి, వైస్ చైర్‌పర్సన్ దేశిని స్వప్న జన్మదినం సందర్భంగా ఇల్లందకుంట దేవస్థానం మాజీ చైర్మన్ దేశిని కోటి దుప్పట్లు పంపిణీ చేశారు. గాంధీ చౌరస్తాలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు సుంకరి రమేష్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. సైదాపూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ మండలధ్యక్షుడు దొంత సుధాకర్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఇల్లందకుంట మండల కేంద్రం, సిరిసేడులో కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు. వీణవంక బస్టాండ్ వద్ద కాంగ్రెస్ నాయకులు ఇందిరాగాంధీ జయంతిని నిర్వహించారు. చొప్పదండిలో మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నివాళులర్పించారు. గంగాధరలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో ఇందిరా గాంధీ జయంతిని నిర్వహించారు. గన్నేరువరంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంపిణీ చేశారు.

పారిశుధ్య నిర్వహణపై అవగాహన కల్పించాలి

కరీంనగర్ టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య నిర్వహణపై జిల్లాలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు, ఆసుపత్రి సిబ్బంది, మున్సిపల్ కార్మికులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. జిల్లా నీరు, పారిశుధ్య మిషన్ మొదటి సమన్వయ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్లో మంగళవారం నిర్వహించారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం పోస్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ బాలామణి, డిటిడిఓ జనార్దన్, జిల్లా పంచాయతీ అధికారి రవీందర్, జిల్లా వైద్యాధికారి వెంకట రమణ పాల్గొన్నారు.

కళాభారతి పనుల పరిశీలన

గణేశ్‌నగర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కళాభారతి ఆధునికీకరణ పనులను మంగళవారం కలెక్టర్ పమేలా సత్పతి పరిశీలించారు. కళాభారతిలో లైటింగ్, సౌండ్ ఏర్పాటు పనులను, వేదికను, పార్కింగ్ స్థలాన్ని పరిశీలించారు. మరమ్మతులకు సంబంధించి డివిజనల్ ఇంజనీర్ యాదగిరికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, మునిసిపల్ కమిషనర్ చాహత్ బాజ్పేయి, డివిజనల్ ఇంజనీర్ యాదగిరి పాల్గొన్నారు.

'సీఎం సభను విజయవంతం చేయండి'

కరీంనగర్ క్రైం, నవంబరు19 (ఆంధ్రజ్యోతి): వేములవాడలో బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, అభిమానులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయలని ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు. ఈ బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి గల్ఫ్‌లో మృతి చెందిన కార్మిక కుటుంబాలకు 5 లక్షల ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు తెలిపారు. చేనేత కార్మికుల కోసం యారన్ డిపో, జిల్లా ఎస్పీ కార్యాలయం ప్రారంభోత్సవం, 120 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం, మిడ్ మానేర్ భూనిర్వాసితుల కోసం 4,696 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ.237 కోట్ల నిధులను మంజూరు చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

●కరీంనగర్ అర్బన్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వేములవాడ పర్యటనను కాంగ్రెస్ శ్రేణులు విజయవంత చేయాలని కాంగ్రెస్‌పార్టీ కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.

దివ్యాంగుల అవార్డుకు నామినేషన్ల స్వీకరణ

కరీంనగర్‌టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర స్థాయి అవార్డులకు నామినేషన్లు స్వీకరిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ రంగాల్లో సేవలందించిన దివ్యాంగులు, దివ్యాంగుల కోసం పనిచేస్తున్న సంస్థలు ఈ అవార్డు కోసం దరఖాస్తు చేసుకో వచ్చని తెలిపారు. ఈనెల 26లోగా జిల్లా సంక్షేమ ఆధికారి కార్యాలయంలో నామినేషన్లు సమర్పించాలని తెలిపారు.

అల్ఫోర్స్ విద్యార్థినికి నృత్య జ్ఞానజ్యోతి అవార్డు

భగత్‌నగర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాల ఆరవ తరగతి విద్యార్థి టి వరుణ్య నృత్య జ్ఞాన జ్యోతి అవార్డు అందుకున్నారు. మంగళవారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి నరేందర్‌రెడ్డివిద్యార్థిని అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బాసరలోని శ్రీ వాగ్దేవి వాద్య సంగీత కళానృత్య సంస్కృతి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీజ్ఞాన సరస్వతి నృత్య అర్చనలో టి వరుణ్య అద్భుత ప్రదర్శన కనబరిచిందన్నారు.

'హామీల అమలులో కాంగ్రెస్ విఫలం'

కరీంనగర్ టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో విఫలమైందని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ విమర్శించారు. అమలుకు సాధ్యంకాని హామీలతో అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా వాటిని అమలు చేయకుండా ఏమి ఒరగబెట్టారని విజయోత్సవాలను జరుపుకుంటున్నారని ఆయన ప్రశ్నించారు. మంగళవారం నగరంలోని బీఆర్ఎస్ నగరశాఖ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో బీఆర్ఎస్ నగర ప్రధాన కార్యదర్శి గడ్డం ప్రశాంత్‌రెడ్డి, సింగిల్‌విండో మాజీ చైర్మన్ తిరుపతిరావు పాల్గొన్నారు.

నిరుద్యోగుల సమస్యలు పరిష్కరిస్తా

కరీంనగర్ టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీగా తనను గెలిపిస్తే నిరుద్యోగుల సమస్యలు పరిష్కరిస్తానని ట్రస్మా మాజీ రాష్ట్ర అధ్యక్షుడు, సలహాదారుడు, ఎమ్మెల్సీ అభ్యర్థి యాదగిరి శేఖర్‌రావు పట్టభద్రులను కోరారు. మంగళవారం నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీచేస్తున్న తనకు ట్రస్మా సంపూర్ణ మద్దతు ఇస్తోందన్నారు. ఈవిలేకరుల సమావేశంలో ట్రస్మా ప్రతినిధులు, ప్రైవేట్ స్కూల్ కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి

కరీంనగర్ టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తానని మాజీ మేయర్, సివిల్ సప్లయి కార్పొరేషన్ మాజీ చైర్మన్, ఎమ్మెల్సీ అభ్యర్థి సర్దార్ రవీందర్‌సింగ్ అన్నారు. మంగళవారం కరీంనగర్ అర్బన్, రూరల్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు వెళ్ళి ఉపాధ్యాయులనుకలిసి ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.

ఆందోళన బాటలో..

(5వ పేజీ తరువాయి)

తమపై తీవ్ర ఒత్తిడి పెరిగిందని యజమాన్యాలు అంటున్నాయి. జీతాలు ఇవ్వని కారణంగా సిబ్బంది తమకు సహకరించడం లేదని, ఆర్థిక సమ స్యలతో తాము కళాశాలలను నడపలేని స్థితికి చేరుకున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. సెమిస్టర్ పరీక్షలను కూడా నిర్వహించలేమని యాజమాన్యాలు తేల్చిచెప్పాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో విద్యా సంవత్సరం ప్రారంభంలోనే కొన్ని కళాశాలలు మూతపడ్డాయి. మరికొన్నింటిది అదే పరిస్థితి.

● ప్రభుత్వం స్పందించాలంటున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో కళాశాలలు నిరవధిక బంద్ పాటిస్తే తమ భవిష్యత్ ఏమిటనీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు సకాలంలో ఇస్తే తమకు ఈ పరిస్థితి వచ్చేది కాదని, ఇప్పటికైనా ప్రభుత్వం బకాయిలు విడుదల చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే డిగ్రీ, పీజీ సీట్లు కూడా పూర్తిగా నిండడం లేదని, భవిష్యత్‌పై ఆశలతో కళాశాలలు నడుపుతున్నామని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇవ్వకుంటే ప్రత్యామ్నాయం చూసుకోవలసిందేనంటూ కళాశాలల నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

హైకోర్టు స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్‌గా రవీందర్‌రెడ్డి



కరీంనగర్ లీగల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది, ప్రస్తుతం హైకోర్టు న్యాయవాది సింగిరెడ్డి రవీందర్‌రెడ్డిని హైదరాబాద్ స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన హైదరాబాద్‌లోని పెద్దంబర్‌పేట, ఇబ్రహీంపట్నం, జాలపల్లి, మీర్‌పేట మున్సిపాలిటీకి సంబంధించిన కేసులూ హైకోర్టులో ప్రభుత్వం తరపున వాదిస్తారు. ఈయన నియమకం పట్ల కరీంనగర్ బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు సింగిరెడ్డి లక్ష్మారెడ్డి, సీనియర్ న్యాయవాది, ఉప్పుల అంజనీప్రసాద్, మంచికట్ల రాజేశం, జిల్లా లీగల్ సెల్ ప్రెసిడెంట్ కల్లెపల్లి లక్ష్మయ్య, అదనపు ప్రభుత్వ న్యాయవాది కూర శ్రీనివాస్ రెడ్డి, తదితరులు అభినందనలు తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి



కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూకాన్ని పరిశీలిస్తున్న సుడా చైర్మన్ నరేందర్‌రెడ్డి

కరీంనగర్ రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని సుడా చైర్మన్ కోమటి రెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం కరీంనగర్ మండలంలోని పలు కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించారు. కేంద్రాల్లో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాలు తూకం పేరిట కాంటా అధికంగా వేస్తున్నారని రైతులు సుడా చైర్మన్‌కు తెలిపారు. అనంతరం రైతుల సమక్షంలో కొనుగోలు కేంద్రం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈకార్యక్రమంలో సీఈఓ మహేస్, కూర నరేష్ రెడ్డి, వీరు రాయమల్లు, రవీందర్ రెడ్డి, కనకారెడ్డి, చంద్రయ్య పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్

కరీంనగర్ రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కరంనగర్ మండలం బొమ్మకల్ గ్రామంలో నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేను మంగళవారం కరీంనగర్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ పరిశీలించారు. ఎన్యూమరేటర్లు చేపడుతున్న సర్వేను నేరుగా వెళ్ళి పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి హిదయతుల్లా, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మంచినీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలి

కరీంనగర్ టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజలకు మంచినీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని నగరపాలక సంస్థ కమిషనర్ చాహత్‌బాజ్‌పాయ్ అధికారులకు సూచించారు. మంగళవారం ఆమె అంబేద్కర్‌నగర్ రిజర్వాయర్‌ను సందర్శించారు. భగత్‌నగర్‌లో మంచినీటి పైపులైను లీకేజీని పరిశీలించి వెంటనే మరమ్మతు చేయించాలని సూచించారు.

గ్రంథాలయ వారోత్సవాలు

కరీంనగర్ కల్చరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాలు, మహిళా దినోత్సవం సందర్భంగా మంగళవారం గ్రంథా లయంలో జరిగిన ఇందిరాగాంధీ జయంతి, రంగోలి, మెహందీ పోటీలకు గ్రంథాలయ సంస్థ చైర్మన్ చైర్మన్ సత్తు మల్లయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. న్యాయనిర్ణేతలుగా బాలభవన్ సూపరెండెంట్ కట్ట మంజులాదేవి, సూర్యశ్రీ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఎ సరిత, లైబ్రేరియన్ జి సరిత, సిబ్బంది కె మల్లయ్య, జె గౌతమి, పి నాగభూషణం, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభమయ్యేదెన్నడో..?



గత సంవత్సరం వర్షాలకు కొట్టుకుపోయిన ఇరుకుల్ల బ్రిడ్జి

కరీంనగర్ రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వర్షాలకు కొట్టుకుపోయిన బ్రిడ్జిని పట్టించుకునేవారు కరువయ్యారు. గత ప్రభుత్వ హయాంలో నిధులను మంజూరు చేసినా కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల పనులు ఇప్పటికీ ప్రారంభం కాలేదు.

కరీంనగర్ మండలం ఇరుకుల్ల వాగుపై ఉన్న పురాతన బ్రిడ్జి గత సంవత్సరం వర్షాల కారణంగా కొట్టుకుపోయింది. ఆ సమయంలో మంత్రిగా ఉన్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్ బ్రిడ్జి నిర్మాణానికి 1.92 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయించారు. పనులకు టెండర్లు నిర్వహించారు. సంవత్సరం గడిచినా కాంట్రాక్టర్ పనులు ప్రారంభించలేదు. ఈ బ్రిడ్జి సమీపంలోనే ఇరుకుల్ల, దుర్శేడ్ గ్రామస్థుల పొలాలు ఉన్నాయి. దీంతో రైతులు, గ్రామస్థులు ఇబ్బంది పడుతున్నారు. బ్రిడ్జి ఉపయోగంలో లేక పోవడంతో కొందరు రోడ్డు కబ్జాకు యత్నిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బ్రిడ్జి నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు, గ్రామస్థులు కోరుతున్నారు.

'దళితులను అరెస్టు చేయడం సరికాదు'

ఇల్లందకుంట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో జరిగే సీఎం సభను దృష్టిలో ఉంచుకుని దళితులను అరెస్టు చేయడం సమంజసం కాదని మున్సిపల్ మాజీ చైర్మన్ పోడేటి రామస్వామి అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన దళితబంధు పథకం దళితులకు వరమన్నారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో ఐదు వేల కుటుంబాలకు రెండో విడత డబ్బులు జమ చేయాల్సింది పోయి అక్రమంగా అరెస్టు చేయడం సరికాదన్నారు. అక్రమంగా అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని, లేక పోతే దళితులు కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు

హుజూరాబాద్‌రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆయిల్ పామ్ సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని జిల్లా ఉద్యాన, పట్టు శాఖాధికారి రావిలాల శ్రీనివాస్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని ధర్మరాజుపల్లి, ఇప్పల నర్సింగాపూర్ సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగులో తీసుకోవాల్సిన సమగ్ర సస్యరక్షణ చర్యలు, నీటి యాజమాన్యం, ఎరువుల యాజమాన్యం గురించి వివరించారు. కార్యక్రమంలో డివిజన్ ఉద్యాన అధికారి మంజువాణి, కంపెనీ ఫీల్డ్ ఆఫీసర్ వేణు, రైతులు పాల్గొన్నారు.

'విస్‌డమ్'లో ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి

జమ్మికుంట రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విస్‌డమ్ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఝాన్సీ లక్ష్మీబాయి జయంతిని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె విజేందర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు అమలు చేయాలి



డిప్యూటీ తహసీల్దార్ పార్థసారధికి వినతిపత్రం అందజేస్తున్న డీఎస్పీ జిల్లా అధ్యక్షుడు తాళ్ల నరేష్

చిగురుమామిడి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీలు అమలు చేయాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తాళ్ల నరేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం డిప్యూటీ తహసీల్దార్ పార్థసారధికి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ తర్వాత హామీలను మరిచిపోయిందని విమర్శించారు. ప్రభుత్వం స్పందించకుంటే తమ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించినారు. కార్యక్రమంలో మండల నాయకులు జిల్లెల సురేష్, ఎలగందుల అనిల్, భూపతి, రమేష్, శ్యామ్ పాల్గొన్నారు.

● సైదాపూర్: మధ్య తరగతి వరాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరతూ ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దార్ మంజులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నరేష్, రమేష్, సభ్యులు భూపతి, శ్యామ్, అనిల్ పాల్గొన్నారు.

హుజూరాబాద్‌లో కోతుల బెడద



హుజూరాబాద్ వీధుల్లో సంచరిస్తున్న కోతులు

హుజూరాబాద్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలో కోతుల బెడద తీవ్రమైంది. నాలుగు రోజుల క్రితం హుజూరాబాద్ సూపర్‌బజార్ రోడ్‌లో ఓ మహిళపై కోతులు దాడి చేశాయి. కోతులు ఇళ్లలోకి చొరబడి మనుషులపై దాడి చేస్తూ దొరికిందల్లా పట్టుకెళ్తున్నాయి. రోడ్డు వెంట నడుస్తూ ఉంటే చేతిలోని సంచిని లాక్కుని పారిపోతున్నాయి. మనుషులను గాయపరుస్తూ భయపెడుతున్నాయి. పట్టణంలోని తెనుగువాడ, శివాలయం వీధి, సూపర్‌బజార్, వరంగల్ రోడ్, కాకతీయ కాలనీ, విద్యానగర్, ఎస్‌డబ్ల్యూ కాలనీల్లో తలుపులు తీయాలంటేనే వణుకుతున్నారు. ఇంటి ముందు గల వస్తువులు, తినుబండారాలు, ఇంటిపైకప్పులో గల వస్తువులను చిందరవందర చేస్తూ బెంబెలెత్తిస్తున్నాయి. గతంలో మున్సిపల్ పాలకవర్గం డబ్బులు ఇచ్చి రెండు వేల కోతుల వరకు పట్టి అడవి ప్రాంతంలో వదిలిపెట్టాయి. మిగిలిన కోతులు వాటి సంతానాన్ని పెంపొందించుకొని వేల సంఖ్యలో వృద్ధి చెందాయి. మున్సిపల్ పాలకవర్గం కోతుల బెడద నుంచి కాపాడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

● తలుపులు తీయాలంటే భయమేస్తోంది..



\- సాల్లు బాబు

తలుపులు తీయాలంటే భయమేస్తోంది. ఎప్పుడు ఎక్కడి నుంచి కోతుల వచ్చి దాడి చేస్తాయో తెలియడం లేదు. ఇంట్లో వస్తువులను చిందరవందరం చేస్తున్నాయి.

● గుట్టలు, అడవుల విధ్వంసంతోనే కోతుల రాక..



\- నలుబాల వేణుగోపాల్, సామాజిక కార్యకర్త

కోతుల ఆవాసాలైన గుట్టలు, అడవులను తమ ఇష్టానుసారంగా విధ్వంసం చేయడంతో అవి జనావాసాల్లోకి వస్తున్నాయి. వాటి విధ్వంసాన్ని ఆపితేనే తమ స్థావరాల నుంచి బయటకు రావు.

'అదనపు తరగతి గదులు మంజూరు చేయాలి'

గన్నేరువరం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదుల మంజూరు చేయాలని ఎంఈవో, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, కె.రామయ్య మంగళవారం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను కలిసి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతున్నందున విద్యార్థులకు సరిపడా తరగతి గదుల అవసరాన్ని ఎమ్మెల్యేకు వివరించినట్లు ఆయన తెలిపారు. మండల కేంద్రంలోని పాఠశాలకు నాలుగు అదనపు తరగతి గదులు అవసరముందని చెప్పడంతో స్పందించిన ఎమ్మెల్యే గదుల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు ఎంఈవో తెలిపారు.

రూ. 6,850 పలికిన పత్తి ధర

జమ్మికుంట, నవంబర్ 19 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 6,850 రూపాయలు పలికింది. మంగళవారం మార్కెట్‌కు 59మంది రైతులు 647క్వింటాళ్ల విడి పత్తి, నలుగురు రైతులు ఎనిమిది క్వింటాళ్ల ఎనిమిది క్వింటాళ్ల గోనె సంచుల్లో తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర 6,850, కనిష్ఠ ధర ఆరు వేల రూపాయలు చెల్లించి కొన్నారు. 221 మంది రైతులు 3,615 క్వింటాళ్ల పత్తిని సీసీఐకి మద్ధతు ధరకు విక్రయించారు.

గ్రామోత్సవం పోస్టర్ ఆవిష్కరణ

మానకొండూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 23, 24 తేదీల్లో మానకొండూర్ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగే గ్రామోత్సవం క్రీడా పోటీల పోస్టర్‌ను కలెక్టర్ పమేలా సత్పతి మంగళవారం ఆవిష్కరించారు.

కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, ఈషా ఫౌండేషన్ వలంటీర్ గూడూరి మమత, సుశాంత్, నాగరాజు, శ్రవణ్, ఆకాశ్ పాల్గొన్నారు.

'సైనిక్ స్కూల్‌లో సమస్యలు పరిష్కరించాలి'

చొప్పదండి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుక్మాపూర్ సైనిక్ స్కూల్‌లో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు బూత్కూరి శంకరయ్య ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ఎమ్మెల్యేను కోరారు.

క్షయ లక్షణాలు ఉంటే పరీక్షలు చేయించుకోవాలి



కార్యక్రమంలో పాల్గొన్న వైద్య సిబ్బంది, అధికారులు

శంకరపట్నం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): క్షయ లక్షణాలు ఉంటే నిర్లక్ష్యం చేయకుండా పరీక్షలు చేయించుకోవాలని జిల్లా క్షయ నివారణాధికారి డాక్టర్ రవీందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో సమావేశ మందిరంలో టీబీ చాంపియన్స్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ క్షయ వ్యాధితో బాధపడేవారు జాగ్రత్తలు తీసుకుంటే ఇతరులకు వ్యాధి సంక్రమించదన్నారు. ప్రభుత్వం క్షయ వ్యాధికి ఉచిత వైద్యం అందిస్తుందన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు మాట్లాడుతూ అందరూ టీబీ వ్యాధి పై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ శ్రావణ్, స్టేట్ లీడ్ పురుషోత్తం, హుజూరాబాద్ టీయూ ఎస్‌టీఎస్ శ్రీనివాస్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ సాజిద్, అనిల్, టీబీ అలర్ట్ ఇండియా కో ఆర్డినేటర్ రాజబోసు పాల్గొన్నారు.

● జమ్మికుంట రూరల్: టీబీ వ్యాధి నిర్మూలనకు అందరం కలిసి కట్టుగా కృషి చేయాలని ఎంపీడీవో భీమేష్ అన్నారు. మంగళవారం పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో టీబీ అలర్ట్ ఇండియా-ఇంపాక్ట్ ఇండియా ప్రాజెక్ట్ వారి సహకారంతో వావిలాల, ఇల్లందకుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారుల ఆధ్వర్యంలో టీబీ చాంపియన్స్‌కు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఏసిఎస్ఎమ్ కో-ఆర్డినేటర్ ఆశోక్, డాక్టర్ చందన, ఎంఎల్‌హెచ్‌పీ మోహన్ రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ దేవేందర్‌రెడ్డి, టీబీ సూపర్వైజర్ సదానందం, ప్రాజెక్ట్ సిబ్బంది తిరుపతి, గీతాంజలి పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

● వీణవంక: వీణవంక, మామిడాలపల్లి జడ్పీహెచ్ఎస్‌లో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు.

● సైదాపూర్: మండలంలోని ఆకునూర్ ఉన్నత పాఠశాలలో మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలపై విద్యార్థులకు ఎక్సైజ్ అధికారులు అవగాహన కల్పించారు.

● హుజూరాబాద్: పట్టణ శివారులోని పరకాల క్రాస్ రోడ్ వద్ద మంగళవారం టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు.

● శంకరపట్నం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డీఈవో జనార్దన్‌రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు.

● హుజూరాబాద్‌రూరల్: పట్టణం, మండల వ్యాప్తంగా 21 మత్స్యకారుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకోవాలని ముదిరాజ్ మహాసభ నాయకులు కోరారు. మండల కేంద్రంలో ఉత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

\- మండలంలోని సింగాపూర్ కిట్స్‌లో విద్యార్థులకు ఏఐ, సాఫ్ట్‌వేర్ కోర్సులపై అవగాహన సదస్సు నిర్వహించారు.

\- పట్టణ శివారులోని డిపో క్రాస్ వద్ద మంగళవారం రాత్రి బస్సును వెనుక నుంచి ఓ కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు ముందుభాగం దెబ్బతిన్నది.

● గంగాధర: మండలంలోని ఇస్లాంపూర్ గ్రామానికి చెందిన జిట్టవేణి రాయలింగం కూతురు వివాహానికి తూడి లచ్చయ్య పుస్తెమట్టెలతోపాటు 25వేల ఆర్థిక సహాయం అందించారు.

● తిమ్మాపూర్: మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిభపూలే బీసీస్ మహిళా అగ్రికల్చర్ కళాశాలలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అసోసియేట్ డీన్ వి నరసింహారెడ్డి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు.

\- తిమ్మాపూర్ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌వో వెంకటరమణ ఆకస్మికంగా తనిఖీ చేశారు.

● రామడుగు: విద్యార్థులు మత్తు పదార్థలకు దూరంగా ఉండాలని కరీంనగర్ ఎక్సైజ్ ఏఈఎస్ నాగేశ్వర్‌రావు అన్నారు. మండలంలోని వెలిచాల గ్రామంలోని జిల్లా ఉన్నత పాఠశాలలో మత్తు పదార్థాలతో అనర్థాలపై అవగాహన కలిపించారు.

● కరీంనగర్ కల్చరల్: నగరంలోని ఆలయాల్లో సంకటహర చతుర్థి పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భగత్‌నగర్ అంజనాద్రి లక్ష్మీగణపతి, జడ్పీ క్వార్టర్స్ అయ్యప్ప, రాంపూర్ గిద్దెపెరుమాండ్లు, కమాన్‌రోడ్ రామేశ్వర, అశోక్‌నగర్ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో పూజలు చేశారు.